క్లుప్తంగా

సుబ్బారాయుడి చిత్రపటం బహూకరణ



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారికి భక్తుడు విజయవాడ వాస్తవ్యులు చాట్ల ఈశ్వరరెడ్డి, వసుందర దంపతులు స్వామివార్ల చిత్రపటం బుధవారం బహూకరించారు. ఉదయం ఆలయానికి చేరుకున్న రెడ్డి కుటుంబ సభ్యులు స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావుకు స్వామివార్ల చిత్రపటం అందజేశారు. దాత కుటుంబ సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి చందనాలంకారం



చల్లపల్లి: స్థానిక నిమ్మలతోటలోని శ్రీహరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో నరసింహస్వామి చందనోత్సవం సందర్భంగా బుధవారం అయ్యప్ప స్వామికి చందనంతో కూడిన దివ్యాలంకరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు భానూ నంబూద్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రాములోరి విగ్రహం ఊరేగింపు



పెడన: పట్టణంలో రాములోరి విగ్రహాన్ని బుధవారం ఊరేగించారు. గూడూరు మండలం పోసినవారిపాలెం పంచాయతీ పిండివారిగ్రామంలో మే 4వ తేదీన విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు గ్రామ కమిటీ పెద్దలు పేర్కొన్నారు. విగ్రహ ప్రతిష్ట అనంతరం ఆ రోజు మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఉంటుందని, భక్తులు పాల్గొని స్వామి వారి అన్న ప్రసాదాలను స్వీకరించాలని వారు కోరారు.

మున్సిపాలిటీకి రూ.39 లక్షల ఆదాయం



పెడన: ఆస్తి పన్నులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఐదు శాతం రాయితీ ఏప్రిల్ 30వ తేదీతో గడువు ముగుస్తుండటంతో చాలా మంది ఆ రాయితీని సద్వినియోగం చేసుకునేందుకు ఆసక్తి చూపారు. 2025- 26 ఏడాదికి సంబంధించి ఆస్తి పన్ను వసూళ్లకు సంబంధించి ఆర్థిక సంవత్సరం ప్రారంభ నెలలో ఐదు శాతం రాయితీ కల్పించింది. ముందు నెలలో ఎవరు ఆస్తి పన్ను చెల్లించడానికి ఆసక్తి చూపుతారో వారికి ఐదు శాతం రాయితీ ఇస్తామని పేర్కొవడంతో మున్సిపాలిటికి ఈ ఆర్థిక సంవత్సరం మొదటి నెల 29వ తేదీ వరకు రూ.39 లక్షలు ఆదాయం వచ్చిందని మున్సిపల్ ఆర్ఐ పామర్తి వెంకటేశ్వరరావు తెలిపారు. 30వ తేదీ రాత్రి ఏడు లేదా 8 గంటల వరకు ముగుస్తుందని, ఏప్రిల్ నెల పూర్తయిన తరువాత ఎంత మంది కట్టింది, ఎంత కట్టిందనే వివరాలు తెలుస్తాయని ఆయన పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ నేతకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



చల్లపల్లి: వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ నాయకులు రసూల్ ఘోరి తండ్రి యాసిన్ ఘోరీని వైస్సార్ సీపీ అవనిగడ్డ నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు బుధవారం పరామర్శించారు. ఇటీవల యాసిన్ ఘోరి అనారోగ్యానికి గురై విజయవాడలో గుండె ఆపరేషన్ చేయించుకుని క్రమంగా కోలుకుంటున్నారు. విషయం తెలుసుకున్న సింహాద్రి రమేష్ ఆయన ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని సాధారణ జీవనంలోకి రావాలని ఆకాంక్షించారు. ఆయన వెంట పార్టీ నాయకులు మోపిదేవి ద్వారకానథ్, మత్తి రాంబాబు, మైనార్టీ సెల్ నాయకులు అబ్దుల్ అర్షద్, కమాల్, మహ్మద్ గయాజ్, సయ్యద్ రఫీ, సయ్యద్ జహీర్, కరీమ్ తదితరులు ఉన్నారు.

అగ్ని ప్రమాదాల మిస్టరీ వీడేనా?

- చేనేత కార్మికుల ఇళ్లలో వరుస అగ్ని ప్రమాదాలు
- ఆందోళనలో నేతన్నలు
- కప్పలదొడ్డిలో ఏం జరుగుతోంది?
- అందరిలోనూ ఇదే చర్చ



తగలబడిపోయిన చేనేత వస్త్రాలు నేయడానికి ఉపయోగించే నూలు (ఫైల్)

గూడూరు: మండల పరిధిలోని కప్పలదొడ్డిలో వరుసగా జరుగుతున్న అగ్ని ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. చేనేత కార్మికులు ఎక్కువగా ఉండే కప్పలదొడ్డిలో గత పది రోజుల వ్యవధిలో 9 మంది నేతన్నల ఇళ్లల్లో మూడు సార్లు అగ్ని ప్రమాదాలు సంభవించాయి. రాత్రి సమయంలో జరుగుతున్న ఘటనల వెనుక ఎవరో అగంతకులు ఉన్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నేత మగ్గాలు, నూలు, చేనేత సామగ్రి లక్ష్యంగా అగంతకులు నిప్పు పెట్టినట్లు గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

పది రోజుల నుంచి..

పది రోజుల క్రితం గ్రామానికి చెందిన పేరిశెట్టి పైడేశ్వరరావు, బూసం పురుషోత్తంల ఇళ్లల్లో చేనేత ముడిసరుకుకు నిప్పంటించారు. రాత్రి సమయంలో జరిగిన ఈ ఘటనలో నూలు, చేనేత సామగ్రి కాలి బూడిదయ్యాయి. మరలా గత మంగళవారం రాత్రి ఐదారు కుటుంబాలు జీవనం సాగిస్తున్న ఇళ్లల్లో చేనేత సామగ్రిని తగలబెట్టారు. అంతే కాకుండా విద్యుత్ మీటర్, కుర్చీలు, వాటర్ ట్యాంకర్ వంటి గృహోపకరణాలకు కూడా నిప్పు పెట్టారు. దీంతో భయాందోళనకు గురైన గ్రామస్తులు గూడూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి వచ్చిన ఎస్ఐ కె.సత్యనారాయణ వరుసగా జరుగుతున్న ఘటనలపై విచారణ జరుపుతున్నారు. పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీ పుటేజీలను కూడా సేకరించారు. కొత్తగా గ్రామంలోకి వచ్చిన వారి వివరాలు చెప్పాలని, ఇతర అంశాలపై పోలీసులు విస్తృత ప్రచారం చేయటంతో అగ్నిప్రమాదాలకు విరామం కనిపిస్తోంది. అయితే దుండగుల ఆచూకీ మాత్రం ఇంతవరకు వెల్లడికాలేదు.



కప్పలదొడ్డిలో వివరాలు తెలుసుకుంటున్న చేనేత, దేవాంగ సంఘాల నేతలు (ఫైల్)

పట్టించుకోని అధికారులు..

అగ్ని ప్రమాద బాధితులైన చేనేత కుటుంబాలను ఆదుకోవటంలోనూ మితిమీరిన నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఇటు ప్రభుత్వ అధికారులు కాని, వీరిని కార్మికులుగా ఉపయోగించుకుని వ్యాపారం చేసే బడా వ్యాపారులు కాని పట్టించుకోకపోవటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

చేనేత సంఘాల ఆందోళన..

గ్రామంలో వరుసగా జరుగుతున్న ఘటనలతో ఆందోళనలో ఉన్న చేనేత కార్మికులకు భరోసా కల్పించడానికి ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు బండారు ఆనంద ప్రసాద్ ఆధ్వర్యంలో చేనేత సంఘాల ప్రతినిధులు గత గురువారం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరుసగా జరుగుతున్న ఘటనలను సీరియస్‌గా తీసుకుని పోలీసులు విచారణ జరపాలని డిమాండ్ చేశారు. గ్రామంలో పోలీసు గస్తీ పెంచి.. ఇలాంటి ఘటనలు పునరావృతంకాకుండా చూడాలని ఆయన కోరారు. ఆగంతకులను పట్టుకుని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో చేనేత సంఘాల, దేవాంగ సంఘ నాయకులు పడవల మోహనత్రినాథ్, కారుపర్తి మల్లి, పిచ్చుక ఫణికుమార్, ఆకురాతి జనార్ధన్, తాళ్ల బాలాజీ, బళ్ల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిరోధానికి సహకరించండి



బచ్చుపేట శివాలయంలో ప్రచార పత్రాన్ని ప్రదర్శిస్తున్న పూజారులు



జామియా మసీదులో ప్రచార బ్యానర్‌తో ముస్లిం మత పెద్దలు

మచిలీపట్నంటౌన్: బాల్య వివాహాల కట్టడికి సహకరించాలని వాసవ్య మహిళా మండలి కృష్ణాజిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ సీహెచ్ ఉషారాణి కోరారు. అక్షయ తృతీయ సందర్భంగా బుధవారం ఆమె నగరంలోని పలు హిందూ దేవాలయాలు, చర్చిలు, మసీదులకు వెళ్లి బాల్య వివాహాల నివారణకు సహకరించాలని నిర్వాహకులను కోరారు. పూజారులు, పాస్టర్‌లు, ఇమాంలు, మత పెద్దలను కలసి బాల్య వివాహాల కారణంగా సంభవించే అనర్థాలను వారికి వివరించారు. ప్రార్థనాలయాల్లో బాల్య వివాహాలు జరక్కుండా చూడాలని కోరారు. బాల్య వివాహాలతో యువతీ, యువకులకు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. యువతులకు 18 ఏళ్లు, యువకులకు 21 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలని వారిని కోరారు. బాల్య వివాహాల సమాచారాన్ని పోలీసులకు 112, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 టోల్‌ఫ్రీ నంబర్‌లకు కాల్ చేసి తెలపాలని ఆమె వివరించారు. బుధవారం అక్షయ తృతీయ సందర్భంగా వివాహాలు జరిగే అవకాశం ఉండటంతో బాల్య వివాహాల నియంత్రణలో భాగంగా అవగాహన కలిగించినట్లు ఆమె తెలిపారు. కిశోర బాలికలకు మే నెల 2వ తేదీ నుంచి నుంచి జూన్ 10 వరకు ప్రత్యేక క్యాలెండర్ ద్వారా బాల్య వివాహాలు, పోక్సో, రుతుక్రమం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య తదితర విషయాలపై అవగా హన సదస్సులు నిర్వహించనున్నట్లు ఆమె ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌డబ్ల్యూ వర్కర్ దివ్య తదితరులు పాల్గొన్నారు.

లలితా సహస్రనామ పారాయణం

మచిలీపట్నంటౌన్: నగరంలోని అయ్యప్ప స్వామి ఆలయ 34వ వార్షిక ప్రతిష్టా సప్తాహ మహోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయ ప్రాంగణంలో శ్రీ లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. నగరానికి చెందిన మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పారాయణం చేశారు. ఈ ఉత్సవాలు మే 5వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు ఆలయ భక్త బృందం తెలిపింది. అప్పటి వరకూ స్వామి వారికి పలు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.



పారాయణ చేస్తున్న మహిళా భక్తులు

మట్టి తరలిస్తున్న టిప్పర్ల సీజ్

గూడూరు: అనుమతులు తీసుకోకుండా మట్టి తరలిస్తున్న టిప్పర్లను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. మండల పరిధిలోని మల్లవోలు శివారు చటారిపాలెంకు ఐదు టిప్పర్లతో మట్టి తీసుకువస్తున్నారు. మొవ్వ మండలం కూచిపూడి పరిసర ప్రాంతాల నుంచి మట్టి తరలించి స్థానికంగా ఉన్న చెరువు పూడ్చుతున్నట్లు రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. దీనిపై స్పందించిన తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి ఆర్ఐ పి.ఝాన్సి, వీఆర్వోలను మట్టి వాహనాల అనుమతులు పరిశీలించాలని ఆదేశించారు. దీంతో వాహనాలను పరిశీలించి అనుమతులు లేవని నిర్ధారించుకుని 5 టిప్పర్లు, జేసీబీని సీజ్ చేసి గూడూరు తహసీల్దారు కార్యాలయానికి తరలించారు. అనంతరం వాహన యజమానులకు జరిమానాలు విధించినట్లు తహసీల్దారు తెలిపారు.



అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న టిప్పర్లను సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారులు

పీఏసీఎస్ సీఈవో హరిబాబుకు సత్కారం

పెడన: స్థానిక జయలక్ష్మి పీఏసీఎస్ సీఈవోగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన తోట హరిబాబుకు బుధవారం సహచర ఉద్యోగులు, మాజీ పాలకులు, అధికారులు ఘనంగా వీడ్కోలు పలికి హరిబాబు దంపతులను సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో హరిబాబు సేవలను కొనియాడారు. పేరుపేరున అందరికీ హరిబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, చందన నారాయణరావు, మట్టా రాధాకృష్ణమూర్తి, పలు పీఏసీఎస్‌లకు చెందిన సీఈవోలు, కార్యదర్శులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



తోట హరిబాబు దంపతులను సత్కరిస్తున్న నారాయణరావు, వేణుగోపాలరావు తదితరులు

పునీత జోజప్ప జీవితం కార్మిక లోకానికి ఆదర్శం

గుడ్లవల్లేరు: కార్మికులారా ఏకం కండి! అన్న నినాదం ఏసుక్రీస్తు జీవితంలో నుంచే వెలువడింది. ప్రభువును పెంచిన తండ్రి కార్మిక పునీత జోజప్ప. ఆయన కార్పెంటర్‌గా జీవితమంతా పని చేశారు. కథోలికులు జోజప్పను కార్మికునిగా మే ఒకటిన గుర్తించారు. 1963లో స్థాపించిన గుడ్లవల్లేరు ఆర్సీఎం చర్చిలో ఏప్రిల్ 22 నుంచే జోజప్ప పండుగలు జరుగుతున్నాయి. చర్చి ఫాదర్ మ్యాథ్యూ మాటల్లో.. ప్రపంచమంతా అన్ని దేశాల్లో ఆర్సీఎం చర్చిల్లో ఈ జోజప్ప పండుగ వేడుకలను జరుపుకొంటారు. జిల్లాలోనే ప్రత్యేకంగా జోజప్ప పండుగను ఈ చర్చిలోనే తొమ్మిది రోజుల పాటు భారీగా జరుపుతున్నాం. మే ఒకటిన జరిగే పునీత జోజప్ప భారీ ఊరేగింపు, దివ్యబలి పూజతో ఈ పండుగలు ముగియనున్నాయి. వేలాది మంది ఏసు విశ్వాసులు ఈ పండుగను అంగరంగ వైభవంగా జరుపుకొంటారు. ఈ చర్చి కింద 30గ్రామాల వరకూ ఉన్నాయి. ఆయా ప్రాంతాల విశ్వాసులకు స్థానికంగా చిన్నపాటి ఆర్సీఎం చర్చిలున్నాయి. ఈ భారీ చర్చికి విద్యుద్దీపాలంకరణ అందర్నీ ఆకర్షిస్తుంది. ప్రత్యేక ప్రార్థనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నాటకాలతో పాటు వేలాది మంది విశ్వాసులు ఒకేచోట ఏసు ప్రసాదాన్ని స్వీకరిస్తారని ఫాదర్ మ్యాథ్యూ తెలిపారు.



విద్యుద్దీపాల వెలుగులో ఆర్సీఎం చర్చి

కార్మికులకు జడ్జి మేడే శుభాకాంక్షలు

గుడివాడ టౌన్: కార్మిక దినోత్సవం(మేడే) సందర్భంగా వివిధ వర్గాలకు చెందిన కార్మికులకు గుడివాడ 11వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ జీ సుబ్రహ్మణ్యం బుధవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మిక వర్గాన్ని గౌరవించడానికి న్యాయమైన వేతనం, మెరుగైన పని పరిస్థితి కోసం వారి పోరాటాలను స్మరించుకుంటూ జరుపుకొంటున్న కార్యక్రమమే మేడే అన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న రోజువారీ సవాళ్లు, ఆర్థికాభివృద్ధి, అందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు, మారుతున్న పరిస్థితులను బట్టి చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

పనికి తగిన వేతనం, సరిపడా సమయాన్ని మాత్రమే కార్మికులకు కేటాయించాలని, పనిచేసే సమయాల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు వారికి తగిన భీమా సదుపాయాన్ని కల్పించాలన్నారు. ఏదైనా చట్టపరంగా సమస్య ఉన్నప్పుడు మండల న్యాయసేవాధికార కమిటీ గుడివాడ వారిని ఆశ్రయించవచ్చని ఆయన ఈ సందర్భంగా సూచించారు.

ధర్నాను విజయవంతం చేయాలి

పెదముత్తేవి(మొవ్వ): ఉపాధి హామీ పథకంలో కార్మికుల సమస్యలపై ఈ నెల ఐదవ తేదీన ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు మేరకు అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించనున్నట్లు ఈ సంఘం జిల్లా అధ్యక్షుడు శీలం నారాయణరావు పేర్కొన్నారు. మొవ్వ ఎంపీడీవో కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ పెదముత్తేవి, కొండవరం గ్రామాల్లోని ఉపాధి కూలీలకు బుధవారం ఆయన కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ మేస్త్రీలు వెంకటేశ్వరరావు, శాంతి, లక్ష్మణ, బాలాజీ, రాజేష్, గంగాభవాని, అర్జునరావు, మరియమ్మ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'హంస' నూతన కమిటీ ఎన్నిక

మొవ్వ: ఆంధ్రప్రదేశ్ మెడికల్ అడ్మినిస్ట్రేషన్ హెల్త్ సర్వీసెస్ అసోసియేషన్(హంస) ఆవిర్భావ కమిటీ ఎన్నికను మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం నిర్వహించారు. మొవ్వ తాలూకా కమిటీ ఎన్నిక, ఆవిర్భావ సభను రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్ అధ్యక్షతన నిర్వహించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా కే రామాంజనేయులు, సెక్రటరీగా కొల్లి విజయకుమారి, జాయింట్ సెక్రటరీ బాపమ్మలతో పాటు ఇతర కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో హంస అసోసియేషన్ కార్యకలాపాలు మరింత చురుగ్గా సాగేందుకు ఈ కమిటీ దోహదపడాలని అరవపాల్ ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో వివిధ ప్రదేశాల నుంచి వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు హాజరై సంఘీభావం ప్రకటించారు.

కౌన్సిల్ సమావేశం అర్ధంతరంగా వాయిదా

- గత సమావేశాల్లో టేబుల్ అంశం చేర్చకుండా దాటవేతపై ఆగ్రహం
- కమిషనర్ సభ్యులను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ మండిపాటు
- కౌన్సిల్ అత్యవసర సమావేశంలో సభ్యులు



కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ నాగకుమారి, మాట్లాడుతున్న కమిషనర్ గోపాలరావు



సమావేశం వాయిదా వేయాలని కోరుతున్న కౌన్సిలర్ చంద్రబాబు తదితరులు

పెడన: కౌన్సిల్ అత్యవసర సమావేశం అర్ధంతరంగా వాయిదా పడింది. మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ హాలులో బుధవారం మధ్యాహ్నం మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన జరిగింది. అజెండాలోని అంశాలను చదివేందుకు సిద్ధమవ్వగా 9వ వార్డు కౌన్సిలర్ గరికిముక్కు చంద్రబాబు మాట్లాడుతూ గత రెండు సమావేశాల్లో అడిగిన ప్రశ్నలకు సమాధానం కావాలని చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువెళ్లారు. మున్సిపల్ స్థలాన్ని కబ్జా చేసి విక్రయించిన అంశాన్ని టేబుల్ అంశంగా చేర్చాలని గత రెండు కౌన్సిల్ సమావేశాల్లో కోరామని చంద్రబాబు అన్నారు. వాటికి కమిషనర్ గోపాలరావు వచ్చే సమావేశంలో చేర్చుతానని మాటా ఇచ్చి ఇప్పుడు కూడా చేర్చకపోవడం ఏమిటంటూ ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ గోపాలరావు స్పందిస్తూ ఎండార్స్‌మెంటు కాపీని కౌన్సిలర్ చంద్రబాబుకు పంపించామన్నారు. ఆ ఎండార్స్‌మెంటు కాపీ నాకు అందలేదని, వాట్సప్ ద్వారా చూశానని, అందులో నేను ప్రశ్నించిన దానికి సరైనా సమాధానం కాకుండా వేరే అంశాలున్నాయని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఆ ఎండార్స్‌మెంటులో పేర్కొన్న విధంగా జీవో నంబరు 624 కాపీ నేటి వరకు ఇవ్వలేదన్నారు. కమిషనర్ మాట్లాడుతూ 624 జీవో 2019లో వచ్చిందని సభ్యులకు వివరించారు. సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ మాట్లాడుతూ టేబుల్ అంశంగా చేర్చడం వల్ల ఇబ్బంది ఏమిటని, తక్షణం టేబుల్ అంశంగా చేర్చి చర్చించాల్సిందేనని స్పష్టం చేశారు. అనధికారిక లే అవుట్ల కారణంగా మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయం 2019లోనే రూ.6 కోట్ల వరకు ఉందని, ఇది వస్తే వార్డుల అభివృద్ధికి నిధులు సమకూరేవన్నారు. మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయం రాకుండా అనధికార లేవుట్లు, ఆక్రమణలకు గురైన మున్సిపల్ స్థలం అంశాన్ని టేబుల్ అంశంగా చేర్చకుండా కమిషనర్ అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీపీవో నోట్ తయారు చేసి కమిషనర్‌కు పంపించినా కమిషనర్ సంతకం చేయకుండా ఆ అంశాన్ని కౌన్సిల్ దృష్టికి తీసుకురాకుండా చేస్తున్నారంటూ కమిషనర్‌పై మండి పడ్డారు. కమిషనర్ గోపాలరావు మాట్లాడుతూ లోకాయుక్తలో అప్పీల్ చేసి ఉండటం వల్ల దీనిని టేబుల్ అంశంగా పొందుపరచలేమని అన్నారు.

వెనక్కు తీసుకుంటా..

కమిషనర్ గోపాలరావు ఇచ్చిన ఎండార్స్‌మెంటు నేను అడిగిన వివరాలకు సరిపోయినదిగా ఉంటే తాను కోరిన అంశాన్ని వెనక్కు తీసుకుంటానని కౌన్సిలర్ చంద్రబాబు స్పష్టం చేశారు. కమిషనర్ పంపించానని పేర్కొంటున్న ఎండార్స్‌మెంటు కాపీని, తాను కౌన్సిల్ ద్వారా కోరిన అంశాన్ని జిల్లా కలెక్టర్‌కు, సీడీఎంకు పంపించాలని చైర్‌పర్సన్‌కు వివరించారు. వారి నుంచి కమిషనర్ పంపించింది సబబుగానే ఉందని చెబితే తాను పెట్టిన అంశాన్ని వెనక్కు తీసుకుంటానని, అప్పటి వరకు సమావేశాన్ని వాయిదా వేయాల్సిందిగా కోరారు. చాలా సేపు జీవోలపై వాగ్వాదాలు చోటుచేసుకోగా చివరకు మున్సిపల్ చైర్‌పర్సన్ స్పందించి సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడంతో సభ్యులంతా వెళ్లిపోయారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు ఎండీ ఖాజా, బైలపాటి జ్యోతి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఆలయంలో వేదిక నిర్మాణానికి రూ.లక్ష వితరణ



ఘంటసాల: స్థానిక శ్రీజలధీశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేయనున్న అష్టాదశ శక్తి పీఠాలు, ద్వాదశ జ్యోతిర్లింగాల వేదిక నిర్మాణానికి డాక్టర్ చలమలశెట్టి ప్రసాద్ బాబు రూ.లక్ష విరాళం అందించినట్లు దేవాలయాభివృద్ధి కమిటీ నిర్వాహకులు గొర్రెపాటి రామకృష్ణ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో రూ.2.80 లక్షల అంచనాలతో ద్వాదశ జ్యోతిర్లింగాలు (12), అష్టాదశ శక్తి పీఠాలతో (18) వేదిక నిర్మాణం చేయనున్నట్లు రామకృష్ణ చెప్పారు. ఇందుకోసం విజయవాడకు చెందిన పల్మనాలజిస్టు డాక్టర్ చలమలశెట్టి ప్రసాద్ బాబు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గొర్రెపాటి విద్యాట్రస్టు ప్రతినిధి కొండపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు



మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా మూడో రోజైన బుధవారం విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన, పోటీలు నిర్వహించారు. పోర్టురోడ్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉపగ్రంథపాలకులు ఎంవీడీటీ నగేష్ విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన కల్పించారు. గ్రంథాలయాల ఉపయోగాలు, పుస్తకాలను ఎలా వెతకాలి అనే అంశాలను వివరించారు. లైబ్రేరియన్ వై.జయలక్ష్మి డ్రాయింగ్ నేర్పించి పోటీలు నిర్వహించారు. యోగా చేయించారు. ఉపాధ్యాయిని ఎస్.సుబ్బలక్ష్మి నీతి కథలను చెప్పారు.

గడ్డివామి దగ్ధం

నందివాడ: మండలంలోని పోలుకొండ గ్రామంలో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గడ్డివామి దగ్ధమైంది. వివరాల ప్రకారం.. గ్రామంలో రాఘవరావుకు చెందిన గడ్డివామిపై ఉన్న వైర్ల వద్ద షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి 15 ఎకరాల గడ్డి దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.1.50 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. గుడివాడ నుంచి ఫైర్ ఇంజిన్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

ఆలయాల అభివృద్ధికి రూ.40వేలు అందజేత



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు గ్రామదేవత గంగానమ్మ అమ్మవారు, శ్రీ రమాసహిత సత్యనారాయణస్వామివార్ల ఆలయాల జీర్ణోద్ధరణకు రూ.40,464ను కొమ్మనబోయిన సోదరులు రవిశంకర్, శరత్‌బాబు, సత్యనారాయణ, శ్రీనివాసరావు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఈఆర్ఎమ్ విద్యాసంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, డైరెక్టర్లు వల్లభనేని కృష్ణప్రసాద్, పోలవరపు వెంకట్రావు, వల్లభనేని బుడ్డిబాబు, కొమ్మనబోయిన రాము పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రారంభమైన గంగానమ్మ జాతర



బంటుమిల్లి: మండల పరిధిలోని నాగేశ్వరరావుపేట గ్రామంలో బుధవారం నుంచి గ్రామ దేవత గంగానమ్మ జాతర భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభమైంది. మే 4వ తేదీతో జాతర ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు. తొలిరోజు డీజే సౌండ్‌తో మేళతాళాలు, కనకతప్పెట్లతో గంగామన్మ, పోర్లంక లక్ష్మిఅమ్మవారు, పోతురాజు ఘటాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామ పొలిమేరల్లో ఆన కట్టు కట్టారు. జాతర జరగనున్న 5 రోజులు గ్రామస్తులు ప్రతిరోజు అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పిస్తారు.